క్లుప్తంగా

సమస్యలు తీర్చడానికే స్పందన



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో సమస్యల పరిష్కరించేందుకే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవార స్థానిక నగర పాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు తమ కాలనీల సమస్యలను కమిషనర్‌కు విన్నవించి వినతిపత్రాలు అందజేశారు. పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

జీఓ 17 రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను మళ్లించేందుకు ఉపకరించే జీఓ 17ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

కర్నూలు రూరల్: ఎస్సీ వర్గీకరణ చేసి పార్లమెంట్‌లో బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం దగ్గర ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని, హక్కులను కాపాడాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆమ్రేష్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో చర్మకారులకు చెప్పుల దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి.సృజనకు వినతిపత్రం సమర్పించారు.

ఆ భూములతో ఎమ్మెల్యే కాటసానికి సంబంధం లేదు




రిజిస్ట్రేషన్ కాగితాలు చూపుతున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్):కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్‌లో ఉన్న సర్వే నెంబర్ 524లో ఉన్న భూమిపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని సదరు ప్లాట్ల యజమానులు చెప్పారు. సోమవారం వారు ప్లాట్ల వద్దకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ కల్లూరులోని ఈ భూములను ఎమ్మెల్యే కబ్జా చేశారని ఆరోపణలు చేశారని, అవి పూర్తిగా అవాస్తవమన్నారు. 11 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూమిని 1984లోనే అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు ధనారెడ్డి వెంచర్ వేసి విక్రయించారన్నారు. వీటిని 600 మంది దాకా బిట్లుగా కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో ఒక్కొక్కరు ఒకటి నుంచి 8 సెంట్ల వరకు కొనుగోలు చేశారని చెప్పారు. ఇప్పుడు ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే మరెవరో టీడీపీ పేరు చెప్పి వచ్చి ఆక్రమించుకుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్లప్పస్వామి, మహేష్, చల్లా రాముడు, మహ్మద్‌హుసేన్, మాబు, రంగన్న, నాగప్రకాష్, సయ్యద్‌మియ్య పాల్గొన్నారు.

కారెట్ లేన్ డైమెండ్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో తనిష్క్ టాటా ఉత్పత్తుల నుంచి కారెట్ లేన్ డైమెండ్ జ్యూవెలరీ షోరూం ఏర్పాటైంది. దీనిని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైమెండ్ జ్యువెలరీకి రోజు రోజుకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సస్య గ్రూపు ఇక్కడ షోరూం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కారెట్ లేన్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, భరత్, సస్య సంస్థ అధినేతలు క్రిష్ణ మోహన్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆదర్శం జగనన్న పథకాలు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక తన నివాసంలో కర్నూలు-1, 2 వార్డుల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి కార్యకర్త జగనన్న సైనికుల్లా పనిచేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలో వార్డుల పర్యటన చేస్తున్నట్లు వెల్లడించారు.

డెంగీ దోమకు ముకుతాడు!

- జ్వరాల కట్టడికి ప్రభుత్వం చర్యలు
- ఇళ్లల్లో దోమలు పెరగకుండా ప్రజలకు అవగాహన
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- నేడు జాతీయ డెంగీ అవగాహన దినం



దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్న ఆరోగ్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్):దోమ పుట్టకూడదు..పుట్టి నా కుట్టకూడదు. ఇది పక్కాగా క్షేత్రస్థాయిలో అమలైతే దోమల ద్వారావ్యాపించే వ్యాధులను నివారించవచ్చు. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం దోమల నివారణ, నిర్మూలన చర్యలు చేపట్టింది. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఫలితంగా కొన్నేళ్లుగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు జిల్లాలో తగ్గుముఖం పట్టాయి. నేడు జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రస్తుతం 25 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 5 సీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి, ఒక కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. ఈ యేడాది కర్నూలు పట్టణంలో 43, ఆదోని పట్టణంలో 5, ఎమ్మిగనూరు పట్టణంలో 5, సి.బెళగల్ పీహెచ్‌సీ పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో 8, కర్నూలు మండలం ఎదురూరులో 6, దైవందిన్నె పీహెచ్‌సీ పరిధిలోని మల్కాపురంలో 3, కలుదేవకుంట్ల పీహెచ్‌సీలోని వగరూరులో 3, క్రిష్ణగిరి పీహెచ్‌సీలోని దాతమ్మదొడ్డిలో 4, కటారుకొండలో 3, గోనెగండ్లలో 3 డెంగీ కేసులు నమోదయ్యాయి. మొత్తంగా ఈ యేడాది జిల్లాలో 979 అనుమానిత డెంగీ కేసులు, 183 నిర్ధారణ కేసులు నమోదయ్యాయి. వీరికి ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. కాగా డెంగీ లక్షణాలతో చాలా మంది రోగులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. డెంగీ వ్యాధిని ఎలీసా టెస్ట్ ద్వారా నిర్ధారణ చేయాలని ఒకవైపు వైద్య ఆరోగ్యశాఖ చెబుతున్నా ప్రైవేటు ఆసుపత్రులు ఇవేమీ పట్టించుకోకుండా ప్లేట్‌లెట్స్ తగ్గితే దానిని డెంగీగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నాయి. సాధారణంగా తీవ్ర జ్వరంలో ప్లేట్ లెట్స్ తగ్గడం జరుగుతుందని, జ్వరం తగ్గాక ప్లేట్‌లెట్స్ అవే పెరుగుతాయని అధికారులు చెబుతున్నా రు.

డెంగీ జ్వరం ఎలా వ్యాపిస్తుందంటే...

డెంగీ వ్యాధి ఆడ ఈడిస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈడిస్ దోమపైన తెల్లని చారలు కలిగి ఉంటాయి. దీనిని టైగర్ దోమ అని కూడా అంటారు. ఈ దోమ కేవలం పగటిపూట ఎక్కువగా కుడుతుంది.ఈ దోమ ఇంటిలోపల, ఆవరణలోని మంచినీటిలోనే గుడ్లు పెడుతుంది. ఇది 600 మీటర్లలోపు ఎగరగలవు. డెంగీ వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన దోమలోనే గాకుండా దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. డెంగీ వైరస్ ఇన్‌ఫెక్ట్ అయిన దోమకాటు ద్వారా మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ జ్వరం రావచ్చు.

వ్యాధి లక్షణాలు: ఆకస్మికంగా జ్వరం, విపరీతమైన కండరాలు, కీళ్లు, కళ్లనొప్పులు, వాంతులతో డెంగీ వ్యాధి మొదలవుతుంది. కళ్లు కదలించలేని పరిస్థితి. ఎముకల్లోనూ, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జనన ఈ వ్యాధి ప్రమాద లక్షణాలు. కొంత మందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం జరుగుతుంది. వీరికి దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తం ప్లేట్‌లెట్లు తగ్గినా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటారు. ఒకసారి వచ్చిన జ్వరం 7 నుంచి 10 రోజులకు మళ్లీ తిరగబెడుతుంది.

నిర్ధారణ పరీక్షలు: డెంగీ జ్వరం నిర్ధారించడానికి మొదటి వారంలో ర్యాపిడ్ కిట్‌తో ప్రిజమ్‌టివ్ టెస్ట్ పీహెచ్‌సీ నుంచి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేస్తారు. జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రుల్లో సెంటినల్ సెంటర్స్‌లలో డెంగీ వ్యాధికి ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

చికిత్స: ఈ వ్యాధికి ఎలీసా పద్ధతిలో రక్తనమూనాలను పరీక్షించి వ్యాధినిర్ధారణ చేస్తారు. వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధికి పూర్తి చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యులతో చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఏరియా ఆసుపత్రుల్లో సంప్రదించాలి. అక్కడ పూర్తిగా కోలుకునేంత వరకు వైద్యుని పర్యవేక్షణలో ఉంచాలి. అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారవచ్చు.

నివారణ చర్యలు

- ఇంటిలోపల, ఆవరణలో ఎక్కడా మూతలేకుండా కొద్ది నీళ్లు కూడా నిల్వ ఉండకూడదు. ఉదాహరణకు విరిగిపోయిన పెంకులు, పూలకుండీలు, కొబ్బరిచిప్పలు.
- ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, ఫ్లవర్‌వాజ్‌లు, పూల, మొక్కల కుండీలలోని నీటిని తరచూ మారుస్తూ ఉండాలి.
- వాంటర్ ట్యాంకులు ఇంట్లో నీటి నిల్వలపై దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.
- దోమతెరలు వాడటం లేదా ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి.
- ఇంటిలో నీరు నిల్వ ఉంచాల్సి వస్తే తప్పనిసరిగా మూత పెట్టాలి.
- వారానికి ఒకసారి నిల్వ నీరు పారబోసి పాత్రలన్నీ శుభ్రంగా తుడిచిపెట్టుకోవాలి.
- ఇంటిచుట్టూ నీరు నిల్వ ఉంచుకోకూడదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- వారానికి ఒకసారి డ్రైడే పాటించాలి.
- దోమకాటు వేయకుండా పొడుగ్గా, వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలి.

ఎనిమిదేళ్లు జిల్లాలో నమోదైన డెంగీ కేసుల వివరాలు

సంవత్సరం	అనుమానిత కేసులు	నిర్ధారణ అయిన కేసులు
2016	244	33
2017	389	267
2018	191	5
2019	373	63
2020	81	10
2021	1169	170
2022	4088	342
2023 ఇప్పటి వరకు	979	183

ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు



జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 16వ తేదీన అన్ని పీహెచ్‌సీలు, సచివాలయాల పరిధిలో విస్తృతంగా ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఇందులో యువజన, మహిళా సంఘాలు, పొదుపు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కానున్నాయి. డెంగీ వ్యాధికి చికిత్స లేదు. కాబట్టి నివారణపైనే అధికంగా దృష్టి సారించాము. డెంగీ పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో చుట్టుపక్కల 50 ఇళ్లలో ప్రజలకు వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాము. డెంగీ ఉన్నట్లు తేలితే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి చికిత్స చేయిస్తున్నాము. దోమల పుట్టకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 20వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 53వ వార్డు సచివాలయం పరిధిలోని కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాల ఫలాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల దరికే పథకాలను తీసుకెళ్తున్నారన్నారు. గతంలో పింఛన్ తీసుకోవడానికి వృద్ధులు చాలా వ్యయ ప్రయాసలకు గురికావలసి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నెలనెలా ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు మహేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి, రాజమని, రామ్మోహన్‌రెడ్డి, రాజరెడ్డి, బాలచంద్రారెడ్డి, పెద్దన్న, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

కల్లూరులో చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సభ్యుల చేత ప్రమాణ స్వీకరం చేయించారు. ఆలయ కమిటీలో 7 మంది ధర్మకర్త సభ్యులు ఉండగా అందుల్లో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఈఓ వై.గురెడ్డి, కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు హనుమంతురెడ్డి, కేవీ రమణారెడ్డి, రంగప్ప, జగదీష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దాసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమా వేశం ఈ నెల 16వ తేదీన నిర్వహించను న్నారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ సుధాకర్‌తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డ య్య, మెడికల్‌కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా కర్ హాజరు కానున్నట్లు వివరించారు. సమావేశంలో నిర్దేశించిన అజెండా గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ ఎన్.మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల లాగిన్ ప్రతిరోజూ ఓపెన్ చేసి వచ్చిన వాటిని సంబంధిత శాఖలకు బదిలీ చేయాలన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కారాలు చూపకపోతే మళ్లీ వాటంతటవే రీ ఓపెన్ అవుతాయన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో కోడుమూరు, హొళగుంద, పెద్ద కడబూరు మండలాలు పురోగతి చూపాలని ఆయా మండలాల ఏఈలను ఆదేశించారు. హాలహర్వి, తుగ్గలి, దేవనకొండ, కల్లూరు, కర్నూలు మండలాల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ..ఎఫ్‌లైన్ ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 13మండలాలకు సంబంధించి 420 భూ హక్కుపత్రాలు వచ్చాయని, వాటిని సంబంధిత రైతులకు అందజేయాలన్నారు.

డెంగీని పూర్తిస్థాయిలో నియంత్రించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రబలుతున్న డెంగీ జ్వరాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీతో పాటు మలేరియా జ్వరాలను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పెట్టించి, నీటినిల్వలను ఖాళీ చేసి, ఆరబెట్టి నీటినిల్వలపై మూత ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్య, గ్రామీణ నీటి సరఫరా, సంక్షేమ శాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సోషియల్ బీహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ సెల్ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నా తాను మద్దతుగా ఉంటానని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోషియల్ బీహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ సెల్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో పేదరికం, నిరక్షరాస్యత, వలసలు, మూఢనమ్మకాలు, ఆడపిల్లల భద్రత అంశాలతో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ వివాహాలను అడ్డుకునేందుకు జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్ 1902కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. చిన్న వయస్సులో పెళ్లితో కలిగే అనర్థాలపై ఇంటింటా ప్రచారం చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. కాగా, కౌమార దశలోని బాలికలు, గర్భిణుల్లో పౌష్టికాహారలోపాన్ని నివారించేందుకు వైఎస్‌ఆర్ పోషన్ పథకాన్ని సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని ఐసీడీఎస్‌పీడీని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎన్.మౌర్య, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, సెల్ సభ్యులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడా నైపుణ్యాలు పెంచుకోండి

కర్నూలు (టౌన్): ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకుని క్రీడా నైపుణ్యాలు పెంచుకోవాలని స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ అన్నారు. సోమవారం స్థానిక బి. క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉచిత వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. అనంతరం బీక్యాంపు ఫుట్‌బాల్ జట్టు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం సభ్యుడు విజయ్‌కుమార్, ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు రాజశేఖర్, నిర్వాహకులు పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో ఢీకొని మహిళ మృతి

కర్నూలు: నగర శివారులోని వెంకటరమణ కాలనీ నుంచి ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో నిర్మల్ నగర్‌కు చెందిన శైలజ (65) మృతిచెందారు. భర్త కరుణాకర్‌రావు రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి. సోమవారం ఉదయం భార్యాభర్తలు నిర్మల్ నగర్‌లోని ఇంటి వద్ద నుంచి వెంకటరమణ కాలనీ వైపు వాకింగ్ వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా శాంతినగర్ నుంచి కర్నూలుకు వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురైంది. వెంటనే ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా గంట సేపు తర్వాత కోలుకోలేక మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ ఇవీ

ఫార్మాసిస్టుల సమస్యలు నెరవేర్చాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఫార్మాసిస్టుల సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు ఏపీ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ నాయకులు సోమవారం సాయంత్రం వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అధ్యక్షుడు కె.రంగస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్ నాయక్, ట్రెజరర్ పి.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

కర్నూలు (న్యూ సిటీ) : బాలలు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకుని వాటిలో రాణించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ అన్నారు. సోమవారం నగరంలోని నాగిరెడ్డి కాలనీలోని రవీంద్ర హైస్కూల్‌లో మహిళ సంఘం నాయకులు ఈఎల్ఎస్.రత్నమ్మ అధ్యక్షతన వేసవి శిక్షణ తరగతుల శిబిరం నిర్వహించారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు తదితరలు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



జగనన్న పాలన గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన 2వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిన్న మాలగేరి, అర్బన్ బ్యాంగ్ సుబేదార్ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లను ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేసిందని చెప్పారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారికే రూ.1.80లక్షల కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ఈ సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమా చేసిందన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సమస్యలను ఇంటి వద్దకే వచ్చే వలంటీరుకు చెబితే, వాటిని పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌చార్జ్ ఫిరోజ్, వార్డు నాయకులు చాంద్ బాషా, అనురాధ, రవిప్రకాష్, హుసేన్, యూసుఫ్, ఇక్బాల్ వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తే కఠిన చర్యలు

- కమీషన్ ఏజెంట్ ఈశ్వర్ ట్రేడర్స్ లైసన్స్ పూర్తిగా రద్దు
- జనవరి నుంచి మార్చి వరకు ఆదాయ వ్యయాలకు ఆమోదం
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను నష్టపరిచినా, మోసం చేసినా కఠిన చర్యలు తప్పవని పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మార్కెట్ కమిటీ పాలక వర్గం సమావేశం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈశ్వర్ ట్రేడర్స్ (అరవింద్ షేట్) అనే కమీషన్ ఏజెంటు హమాలీ చార్జీల విషయంలో రైతులను దోపిడీ చేస్తున్నారు. చేట, కోత, కాటలకు సంబంధించి హమాలీ చార్జీల కింద రైతుల నుంచి బస్తాకు రూ.12.81 వసూలు చేయాలి. అయితే, ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నట్లు తేలడంతో మార్కెట్ కమిటీ పాలక వర్గం సమావేశంలో ఈశ్వర్ ట్రేడర్స్ (టెండర్ హాల్ బ్లాక్- 5 నంబర్‌షాప్) లైసన్సు పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల ఆదాయ, వ్యయాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులను దగా చేస్తే ఏ స్థాయి వారైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మార్కెట్‌లో పంటలను అమ్ముకోవడానికి వచ్చిన ప్రతి రైతు సంతోషంతో తిరిగి వెళ్లాలనేది పాలకవర్గం ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే, కొంత మంది రైతులను దగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, దీనికి స్వస్తి పలకకపోతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాగా పాలకవర్గం పదవీ కాలాన్ని 6 నెలలు పొడిగించేందుకు సహకరించిన ఎమ్మెల్యే కాటసానిని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి, పాలకవర్గం సభ్యులతో పాటు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు,అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు మంచి స్పందన

కర్నూలు (టౌన్): లోక్ అదాలత్ నోటీసులకు మంచి స్పందన వచ్చింది. రూ.3.5 కోట్ల బకాయిలు ఉన్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌కు రూ. 85 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. భవన యజమానులు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించిన తరువాతనే వారి ఇంటిపై హక్కులు లభిస్తాయని తెలిపారు. గణనీయంగా ఆదాయం రావడానికి కృషి చేసిన ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, శశిలత, హాయత్ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

కర్నూలు (న్యూ సిటీ) : మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కె.భాస్కర్, రమేష్, సురేష్ మాట్లాడుతూ ఒలింపిక్‌లో మహిళ రెజ్లర్లు సత్తా చాటి దేశానికి పేరు తెచ్చారన్నారు. అలాంటి వారిని అభినందించి మరింత ప్రోత్సహించాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైగింక వేధింపులకు పాల్పడటం దారుణన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆయనను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు, పీవైఎల్ నగర కార్యదర్శి రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

వాస్తవ సమాచారంతో సమావేశానికి రండి

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సమావేశానికి అసంపూర్తి సమాచారంతో రావద్దని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 వ తేదీన సీఎండీ సంతోషరావు ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని, ఈ సమావేశానికి వాస్తవ సమాచారం, గణంకాలతో రావాలని సూచించారు. ముఖ్యంగా నెలవారి విద్యుత్ బిల్లుతో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు, 9గంటల నిరంతర విద్యుత్ సరఫరా, ఎస్టిమేట్లు, పనుల పూర్తి, వర్క్ ఆర్డర్ల క్లోజింగ్ వంటి వివరాలు వాస్తవంగా ఉండాలన్నారు. మొక్కుబడి సమాచారం, తప్పుడు గణంగాలతో వస్తే సహించబోమని వెల్లడించారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు అప్రమత్తం కావాలని సూచించారు.